నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
8 | ఖమ్మం, శుక్రవారం 4 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM


సాగులో ఉన్న ఆయిల్‌పాం తోట (ఫైల్)

# పామాయిల్ రైతు ఖుషీ

రెండేళ్లుగా కనీస గిట్టుబాటు ధరలేక ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న ఆయిల్‌పాం రైతులు ఇప్పుడిప్పుడే ఖుషీ అవుతున్నారు. క్రూడాయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం విధించడంతో ఒక్కసారిగా గెలల ధర భారీగా పెరిగింది. ఫలితంగా ఆయిల్‌పాం సాగు విస్తరణ కూడా పెరిగే అవకాశం ఉన్నట్లు ఆయిల్‌ఫెడ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉక్రెయిన్ – రష్యా దేశాల యుద్ధం కారణంగా పామాయిల్ దిగుమతులు నిలిచిపోవడంతో ఇక్కడి గెలల ధర అనూహ్యంగా రూ.23 వేలు దాటిపోయింది. తర్వాత దిగుమతి సుంకం ఎత్తివేయడంతో దశల వారీగా గెలల ధర పడిపోయింది. అప్పటి నుంచి గిట్టుబాటు ధరలేక ఆయిల్‌పాం రైతులు ఆర్థికంగా ఒడుదుడుకులు ఎదుర్కొన్నారు. రైతు సంఘాల వినతికి స్పందించిన కేంద్రం.. దిగుమతులపై మళ్లీ సుంకం విధించడంతో గెలల ధర భారీగా పెరిగింది. రూ.2,651 మేర పెరిగి టన్ను ధర రూ.17,043కు చేరింది. పెరిగిన ధరతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- భారీగా పెరిగిన గెలల ధర
- టన్ను ధర రూ.17,043కు చేరిక
- దిగుమతిపై కేంద్రప్రభుత్వం సుంకం విధింపు ఫలితం
- రెండేళ్ల తీవ్ర ఒడిదుడుకుల తర్వాత ఊరట
- గత కేసీఆర్ ప్రభుత్వ కృషితో పెరిగిన పంట విస్తీర్ణం
- రాష్ట్రవాప్తంగా 2.03 లక్షల ఎకరాల్లో సాగు
- ఇందులో ఉమ్మడి జిల్లాలోనే 80 వేల ఎకరాలు


ఫ్యాక్టరీ వద్ద నిల్వ ఉన్న ఆయిల్‌పాం గెలలు

అశ్వారావుపేట, అక్టోబర్ 3: దీర్ఘకాలిక నికర ఆదాయం అందించే ఆయిల్‌పాంపై అధికశాతం మంది రైతులు ఆసక్తి పెంచుకుని సాగు చేస్తున్నారు. దళారులు లేకుండా పండించిన పంటను నేరుగా ఆయిల్‌ఫెడ్ కొనుగోలు చేసి ముందుగా ప్రకటించిన ధరను రోజుల వ్యవధిలోనే చెల్లిస్తుండడంతో సాగు కూడా అమాంతం పెరిగింది. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, రైతులకు ఆర్థిక భరోసా వంటివి లభించడంతో గత కేసీఆర్ ప్రభుత్వం అప్పట్లోనే రాష్ట్ర వ్యాప్తంగా సాగు విస్తరణకు ప్రణాళికను చేపట్టింది. 10 లక్షల ఎకరాల్లో సాగు పెంపు లక్ష్యంగా హైదరాబాద్, రంగారెడ్డి మినహా ఆయిల్‌ఫెడ్‌కు ఎనిమిది జిల్లాలను, మిగతా 23 జిల్లాలను 12 ప్రైవేట్ కంపెనీలను కేటాయించింది. కేవలం ఉమ్మడి ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయిల్‌పాం సాగు గత కేసీఆర్ సర్కార్ ముందుచూపుతో రాష్ట్రంలో భారీగా విస్తరించింది. ఇప్పుడు రాష్ట్రంలో సుమారు 2.03 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. కేవలం ఉమ్మడి జిల్లాలోనే సుమారు 80 వేల ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు.

### రూ.17,043కు పెరిగిన గెలల ధర

రష్యా – ఉక్రెయిన్ యుద్ధ సమయంలో మాత్రమే ఆయిల్‌పాం గెలల ధర రూ.23 వేలు దాటింది. తర్వాత కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడంతో ధర పతనం దిశగా వెళ్లింది. దీంతో గడిచిన రెండేళ్లలో టన్ను గెలల ధర రూ.14,500 వేలు కూడా దాటలేదు. రూ.12 వేల నుంచి రూ.14,500 వేల మధ్య దోబూచులాడింది. దీంతో రైతులు తోటల నిర్వహణ గిట్టుబాటుగాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీని ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా సాగు విస్తరించాలన్న సర్కారు లక్ష్యంగా నెమ్మదించింది. టన్ను ధర రూ.23 వేలు దాటినప్పుడు తోటల నిర్వహణ, పెరిగిన కూలీల వ్యయం తగ్గకపోవడం వంటి కారణాలతో ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. అప్పటి నుంచి కనీసం టన్ను ధర రూ.20 వేలు ఉండాలని రైతులు, రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ దశలోనే ఖమ్మం పర్యటనకు వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేతృత్వంలో రైతు సంఘం నాయకులు కలిసి సమస్యను విన్నవించారు. ఇందుకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం.. దిగుమతి సుంకాన్ని 20 శాతం, ఇతర పన్నులను 7.5 శాతం కలిపి మొత్తం 27.5 శాతాన్ని విధించడంతో గెలల ధర అదనంగా రూ.2,651కు పెరిగింది. దీంతో టన్ను ధర అమాంతం రూ.17,043కు చేరింది. దీంతో పామాయిల్ రైతులు ఖుషీఖుషీ అవుతున్నారు.

### గెలల ధర రూ.2,651 పెరిగింది..



రైతులు ఆశించిన స్థాయిలో ఆయిల్‌పాం గెలల ధర భారీగా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం విధించడంతో ప్రస్తుతం ఉన్న టన్నుల గెలల ధర రూ.14,392 నుంచి రూ.17,043కు చేరింది. ఈ ధర ఆయిల్‌పాం రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది. రైతులకు దీర్ఘకాలం నికర ఆదాయం అందించే ఆయిల్‌పాం సాగుతోనే భవిష్యత్‌కు భరోసా ఉంటుంది. ఈ దశగా ఇతర రైతులు ఆలోచన చేసి ఆయిల్‌పాం సాగు వైపు దృష్టి సారించాలి.

**–ఆకుల బాలకృష్ణ, ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్, అశ్వారావుపేట**

## సమాజం సిగ్గుపడేలా సురేఖ వ్యాఖ్యలు

- సాటి మహిళపై మహిళా మంత్రి మాటలు అభ్యంతరకరం
- భద్రాద్రి జిల్లా ఇల్లెందులో బీఆర్‌ఎస్ మహిళా నేతల ఖండన
- మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన


మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ మహిళా నాయకులు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 3:రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు తెలుగు సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని బీఆర్‌ఎస్ మహిళా విభాగం ఇల్లెందు మండల నాయకులు, కౌన్సిలర్లు విమర్శించారు. సాక్షాత్తూ మహిళా మంత్రిగా ఉన్న ఆమె.. సాటి మహిళపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. ఈ వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు మహిళా మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ భద్రాద్రి జిల్లా ఇల్లెందులోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద గురువారం వారు ఆమె దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మహిళా నాయకులు మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న కొండా సురేఖ.. సినీ నటి సమంత గురించి తప్పుడు వ్యాఖ్యలు చేయడం శోచనీయమని అన్నారు. అలాగే, మాజీ మంత్రి కేటీఆర్, నటుడు నాగర్జునల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మాట్లాడడం సరికాదని అన్నారు. తక్షణమే వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ నది కంటే కాంగ్రెస్ నాయకుల నోళ్లే కంపు కొడుతున్నాని విమర్శించారు. తొలుత వారే వారి నోళ్లను పినాయిల్‌తో శుభ్రం చేసుకోవాలని హితవు చెప్పారు. కటకం పద్మావతి, సిలివేరు అనిత, సందా బిందు, చీమల సుజాత, పోబోలు స్వాతి, ఖమ్మంపాటి రేణుక, కొక్కు సరిత, గంద్రాతి చంద్రావతి, నారాయణమ్మ, పూనెం కమల పాల్గొన్నారు.

## మంత్రి సురేఖను బర్తరఫ్ చేయాలి: రేగా


రేగా కాంతారావు

మణుగూరు టౌన్, అక్టోబర్ 3: ఇటు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైనా, అటు నటుడు నాగార్జున కుటుంబంపైనా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. ఇంతటి ఆక్షేపణీయమైన మాటలు మాట్లాడిన మంత్రి సురేఖపై కాంగ్రెస్ అధిష్టానంగానీ, సీఎం రేవంత్‌రెడ్డిగానీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం పట్ల ఏమాత్రం గౌరవమున్నా వెంటనే ఆమెను బర్తరఫ్ చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాజకీయాల్లో గతంలో ఏ మంత్రి కూడా ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయలేదని గుర్తుచేశారు. అయినా, మంత్రి సురేఖ వ్యాఖ్యలు ఇంతమంది మనోభావాలను దెబ్బతీస్తుంటే ముఖ్యమంత్రి కనీసం స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. తమ నాయకుడు కేటీఆర్‌పై చిల్లరమల్లర వ్యాఖ్యలు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. సోషల్‌మీడియాలో సురేఖను ఎవరో ట్రోల్ చేస్తే ఆ నెపాన్ని బీఆర్‌ఎస్ మీదకు నెట్టడం కాంగ్రెస్ కుట్రేనని తేల్చిచెప్పారు. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖ పాత్రధారులను ఆరోపించారు.

## కుటుంబ డిజిటల్ కార్డుల జారీ..

# దేశంలోనే మొదటిసారి..

- అమెరికాలో తప్ప మరెక్కడా ఇలాంటి కార్డులు లేవు..
- ప్రతి కుటుంబంలోనూ మహిళ పేరిటే కార్డుల జారీ..
- డాటా ఎంట్రీలో తప్పులు దొర్లితే తర్వాత ఎన్నో ఇబ్బందులు
- 9 వరకూ వివరాల నమోదు.. పత్రాలు సిద్ధంగా ఉంచాలి..
- మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్
- ఖమ్మం జిల్లా ధర్మతండాలో డిజిటల్ కార్డుల సర్వే పరిశీలన


సర్వేలో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్

కూసుమంచి, అక్టోబర్ 3: కుటుంబ డిజిటల్ కార్డుల జారీ దేశంలోకెల్లా తెలంగాణలోనే మొదటిసారిగా జరుగుతోందని మైనింగ్ శాఖ సెక్రటరీ, జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ పేర్కొన్నారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో తప్ప మరెక్కడా ఇలాంటి కార్డులు లేవని గుర్తుచేశారు. డిజిటల్ కార్డుల జారీ కోసం ఒక్కో నియోజకవర్గంలో రెండు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని కుటుంబ సర్వేను చేస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ధర్మాతండాలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న కుటుంబ సర్వేను పరిశీలించారు. సర్వే తీరుతెన్నుల గురించి ఇటు సిబ్బందిని, అటు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుటుంబ డిజిటల్ కార్డుల నయోదు ప్రక్రియ గురువారం మొదలైందిన అన్నారు. శుక్రవారం నుంచి జిల్లా కేంద్రాల్లో డేటాను ఎంట్రీ చేస్తామని అన్నారు. వివరాల నమోదు, డేటా ఎంట్రీ సమయాల్లో తప్పులు దొర్లితే తర్వాత అనేక ఇబ్బందులుండే అవకాశం ఉన్నందున తప్పిదాలు లేకుండా ప్రక్రియను పూర్తిచేస్తామని అన్నారు. ధర్మాతండాలో ఇంటింటికీ వెళ్లి 150 ఇళ్ల సర్వేను పూర్తి చేస్తామన్నారు. అధికారులు కుటుంబ సర్వే కోసం వస్తున్నందున ప్రజలు తమ ఆధార్ కార్డులు సహా ఇతర ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు ఇళ్లలో అందుబాటులో ఉన్న సమయంలోనే సర్వే చేస్తామన్నారు. ఒకవేళ గ్రామంలో సర్వే జరిగిన రోజు వివరాలను నమోదు చేయించుకోలేకపోతే ఎవ్వరూ కంగారు పడాల్సిన పని లేదని అన్నారు. ఈ నెల 9 వరకు గ్రామాల్లో సర్వే చేస్తామని తెలిపారు. ప్రతి కుటుంబంలోనూ ఇంటి పెద్దగా మహిళ పేరిటే కార్డులు జారీ చేస్తామన్నారు. ఈ సర్వే పర్యవేక్షణ కోసం ప్రతీ నియోజకవర్గంలో ఒక జిల్లాస్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, ఇతర అధికారులు వేణుగోపాల్ రెడ్డి, కరుణశ్రీ, రాము, వసంత, జ్యోతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాలు

- ఉన్నతాధికారులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం
- క్షేత్రస్థాయి అవసరాలను బట్టి మరిన్ని పెంచుతాం
- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ ఖాన్


సీఎం వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్, ఇతర అధికారులు

ఖమ్మం, అక్టోబర్ 3: వానకాలం ధాన్యం కొనేందుకు జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని అన్నారు. క్షేత్రస్థాయిలో అవసరాలను పరిశీలించి మరిన్ని కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. 'ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు – డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన – అపాయింట్మెంట్ ఆర్డర్ల ప్రక్రియ' తదితర అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడారు. ప్రతీ కొనుగోలు కేంద్రం పరిధిలోని గ్రామాల్లో సాగైన పంటలు, దిగుబడి వచ్చే ధాన్యం వివరాలను వ్యవసాయ శాఖ నుంచి తీసుకుంటామని, తదునుగుణంగా కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేస్తామని వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన వనరులను వారం రోజుల్లో సిద్ధం చేయాలని సూచించారు. సన్న రకం ధాన్యం వివరాలను ధ్రువీకరించాలని అన్నారు. అవసరమైన మేర టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను అప్రమత్తం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం ఇక్కడికి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో దాన్యం కొనుగోలు సమస్యలను తెలిపేందుకు జిల్లాలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే 1077 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్‌నాయక్, ఏడీసీపీ ప్రసాదరావు, డీఆర్డీవో సన్యాసయ్య, డీఈవో సోమశేఖరశర్మ, ఇతర అధికారులు చందన్‌కుమార్, శ్రీలత, పుల్లయ్య, వెంకటరమణ, అలీం పాల్గొన్నారు.

### కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించాలి: భద్రాద్రి కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని భద్రాద్రి కలెక్టర జితేశ్ వి పాటిల్.. జిల్లా అధికారులను ఆదేశించారు. వానకాలం ధాన్యం కొనుగోలు అంశంపై హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాచలం ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టర్ జితేశ్, ఐడీవోసీ నుంచి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లపై పత్రికల్లో కథనాలు వస్తే స్పందించాలని, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, ఇతర అధికారులు త్రినాథ్, బాబురావు, నరేందర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడంతా.. ఓ పూల వనమాయే..

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైభవంగా బతుకమ్మ వేడుకలు
- ఖమ్మం ఐడీవోసీలో పాల్గొని బతుకమ్మ ఎత్తుకున్న కలెక్టర్
- ఖండాంతరాల్లోనూ పూల పండుగ చేసిన 'భద్రాద్రి' మహిళలు



భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ మామిళ్లగూడెం, అక్టోబర్ 3: బతుకమ్మ వేడుకలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా పులకించిపోతోంది. ఊరూవాడంతా పూల పండుగ పరిమళాలు వెదజల్లుతున్నాయి. ప్రతి వాడా ఓ పూల వనమవుతోంది. ప్రతి ఊరి చెరువూ పూల తోటవుతోంది. తెలంగాణ సాంస్కృతి వైభవాన్ని, వారసత్వాన్ని చాటే బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటుతున్నాయి. బతుకమ్మ సంబురాల్లో భాగంగా రెండో రోజు గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లో అధికారిక ఉత్సవాలు నిర్వహించారు. రెండు రోజు అటుకుల బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ పాల్గొన్నారు. ఉద్యోగులు, జిల్లా అధికారులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర సంక్షేమ శాఖల ద్వారా చేపట్టిన ఈ అటుకుల బతుకమ్మ వేడుకల్లో స్థానిక మహిళలు, మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక భద్రాద్రి జిల్లాలోనూ రెంరో రోజు బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. గ్రామగ్రామాన మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను తెచ్చి ఆడిపాడారు. సాయంత్రమయ్యాక స్థానిక జలాశయాల్లోని ఘాట్‌ల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కాగా, తెలంగాణ బతుకు ప్రతీక అయిన బతుకమ్మ ఖండాంతరాలు కూడా దాటింది. భద్రాద్రి జిల్లాకు చెందిన కొందరు ఆడబిడ్డలు అమెరికాలో స్థిరపడగా.. వారు కూడా అక్కడ బతుకమ్మలతో సందడి చేశారు. పూలపండుగ వైభవాన్ని అగ్రరాజ్యంలోనూ చాటి చెప్పారు. తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మలను, రెండో రోజు అటుకులు బతుకమ్మలను పేర్చి సంబురాలు జరుపుకున్నారు.




కొణిజర్లలో బతుకమ్మ ఆడుతున్న విజయ కాలేజీ విద్యార్థినులు


మధిర రూరల్: బతుకమ్మలతో శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థినులు


కూసుమంచి: భారీ బతుకమ్మతో మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న చిన్నారులు


అమెరికాలో బతుకమ్మ ఆడుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆడబిడ్డలు


ఖమ్మం కలెక్టరేట్‌లో బతుకమ్మలతో వచ్చిన మహిళా ఉద్యోగులతో కలెక్టర్


ఖమ్మం ఎడ్యుకేషన్: రెజొనెన్స్ స్కూల్లో..


ఖమ్మం: తెలంగాణ భవన్‌లో..


ఖమ్మం: బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో..